ప్రజాశక్తి

గురువారం 29 మే 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

హడావుడి.. గందరగోళం..

- రెండు మూడు గంటల్లో కౌన్సెలింగ్‌కు ఉపాధ్యాయులకు రావాలని పిలుపు
- బదిలీలు, ప్రమోషన్లలో షెడ్యూలు పాటించకపోవటంపై విమర్శలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియలో గందరగోళం నెలకొంది. ముందుగా ప్రకటించిన షెడ్యూలు ప్రకారం కౌన్సెలింగ్ జరపకుండా డైరెక్టర్ స్థాయి నుండి జిల్లా అధికారుల వరకూ హడావుడి చేస్తుండటంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులను బుధవారం హడావుడిగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని అధికారులు ఫోన్ ద్వారా సంక్షిప్త సందేశాలు పంపించారు. వాస్తవానికి విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూలు ప్రకారం గ్రేడ్-2 హెచ్‌ఎంల ప్రమోషన్లకు ఈనెల 30న కౌన్సెలింగ్ నిర్వహించాలి. కానీ ముందుగానే అధికారులు హడావుడి చేస్తున్నారు. ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ప్రమోషన్ కౌన్సెలింగ్ బుధవారం పాఠశాల విద్య ఆర్‌జెడి చేపట్టారు. జెడ్పీ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ప్రమోషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకూ బుధవారమే కౌన్సెలింగ్ జరుపుతామని, సాయంత్రం 6 గంటలకు డిఇఒ ఆఫీసుకు హాజరు కావాలని సాయంత్రం 3 గంటల ప్రాంతంలో అధికారుల నుండి సందేశాలు అందాయి. దీంతో జిల్లాలో ఉపాధ్యాయవర్గంలో ఒక్కసారిగా ఆందోళన నెలకొన్నది. హడావుడి సందేశాలతో విమర్శలు వచ్చాయి.

జిల్లాల విభజన జరిగినప్పటికీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ గుంటూరు కేంద్రంగానే నిర్వహిస్తారు. దీంతో దూరప్రాంతాల్లో ఉన్న వారు ఎలా హాజరు కావాలని ఆందోళనపడ్డారు. ఉపాధ్యాయ సంఘాలు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో అధికారులు వెంటనే మళ్లీ షెడ్యూలు మార్చారు. జెడ్పీ పదోన్నతులు 29న ఉదయం 8 గంటలకు నిర్వహిస్తామని ప్రకటించారు. కానీ మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలోని దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూలు ప్రకారం కాకుండా హడావుడి చేయటంతో తర్వాత జరగబోయే బదిలీల విషయంలోనూ ఇదే విధంగా వ్యవహరిస్తారనే ఆందోళన ఉపాధ్యాయవర్గంలో వ్యక్తమవుతోంది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్ లోపాల వల్ల స్టేషన్ ▶ 2లో

వెళ్లడమే.. వచ్చేది లేదు..!

- మాచర్ల యోజకవర్గంలో 231 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ
- ఈ ఏడాదైనా ఉపాధ్యాయుల కొరత తీరేనా...?
- చదువులకు దూరమవుతున్న పేద వర్గాలు

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు జిల్లాలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గం మాచర్ల. అక్షరాస్యతలో చివరిస్థానంలో వుంది. గ్రామీణ ప్రాంతం అధికంగా వున్న నియోజకవర్గంలో సన్న, చిన్నకారు రైతులు, రైతు కూలీలు, చిన్నచిన్న పనులు ▶ 2లో

ఖాళీలను భర్తీ చేయాలి

ఆయేషా సుల్తానా, యూటిఎఫ్ నాయకులు, మాచర్ల.

మారుమూల గ్రామాలు, గిరిజన తండాల విద్యార్థులకు విద్యను అందించటం చాలా ముఖ్యం. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత లేకుండా ప్రభుత్వం చూడాలి. నియోజకవర్గంలో సరిపడా ఉపాధ్యాయులు లేని పాఠశాలలు చాలా ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో తెలుగు, హింది బోధించేందుకు ఉపాధ్యాయులు లేదు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించి, ఆయా పాఠశాలల్లోని ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి.

చదువుకు దూరమవుతున్న బాల్యం

బండ్ల మహేష్, సిపిఎం నాయకులు, మాచర్ల.

ప్రతి ఏడాది మాచర్ల నియోజకవర్గంలో 200 ఉపాధ్యాయులకు పైగా పోస్టులు ఖాళీలగా వుంటున్నాయి. సగం మంది ఉపాధ్యాయులతోనే పాఠశాలలు నడుస్తున్నాయి. దీని వల్ల బాలలు చదువులకు దూరమవుతుండగా, పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అధనపు భారం పడుతోంది. ఇన్ని ఖాళీలకు కారణం ప్రభుత్వాలు ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకపోవటమే.

ఎన్‌టిఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, తదితరులు

పరిపాలనలో ఎన్‌టిఆర్ విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు సంక్షేమ పథకాలు అమలులో, పాలనను ప్రజల ముంగిటకు తీసుకురావటానికి ప్రభుత్వ పరిపాలనలో విప్లవాత్మకమైన సంస్కరణలకు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నాంది పలికారని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకల్లో ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. రామారావు చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళి అర్పించారు. భార్గవ్‌తేజ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు ప్రవేశ పెట్టిన రూ.2కే కిలో బియ్యం పథకం పేదలకు అహార భద్రత ▶ 2లో

కాలనీల నిర్వహణ అధ్వానం

- రూ.7.33 కోట్ల రోడ్ల నిర్మాణం రద్దు - మౌలిక వసతులు సరే సరి
- ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో నిలిచిన ఇళ్ల నిర్మాణం

ప్రజాశక్తి - తెనాలి

గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. మౌలిక వసతుల లేమితో కునారిల్లుతున్నాయి. రోడ్ల నిర్మాణానికి కోట్ల రూపాయలు కేటాయిస్తే ఆ పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. తిరిగి నేటి వరకు పున: ప్రారంభం కాలేదు. వీధిలైట్లు లేక, తాగునీరు పూర్తిస్థాయిలో లభించక, ఉన్న మట్టి రోడ్లు మరింత అధ్వాన్నంగా తయారవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే ఆవాసాలు ఏర్పరచుకున్న స్థానికులు ఇబ్బందులు పడుతుండగా, కొత్తగా గృహ నిర్మాణాలకు లబ్ధిదారులు వెనకడుగు వేస్తున్నారు. పట్టణ పరిధిలో జగనన్న కాలనీల పేరిట ఏర్పాటు చేసిన ఐదు లే అవుట్లలో దుస్థితి ఇలాఉంది..

గత ప్రభుత్వంలో పేదల నివేశన స్థలాలకు పెద్ద ఎత్తున భూసేకరణ చేశారు. ఒక తెనాలి నియోజకవర్గ పరిధిలోనే దాదాపు 27 వేల మందికి స్థలాలు కేటాయించారు. ప్రత్యేకించి తెనాలి పట్టణ పరిధిలో లబ్ధిదారులకు రూరల్ ప్రాంతాల్లో నివేశన స్థలాలు కేటాయించారు. నేలపాడు-1లో 5715 ప్లాట్లు కేటాయించగా 2131 గృహాలు, నేలపాడు-2 లో 1982 ప్లాట్లు కేటాయించగా 1725 గృహాలు, బుర్రిపాలెం లే అవుట్‌లో 9812 ప్లాట్లు కేటాయించగా, ▶ 2లో

అసంపూర్తిగా నిలిచిన ఇళ్లు

మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్‌ఐ, యుటిఎఫ్ నాయకులు

డివైఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో డీఎస్సీ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణం అరండల్‌పేటలోని శ్రీహరిణి అకాడమీలో డిఎస్సీకి సిద్ధమవుతున్న వారికి యుటిఎఫ్, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం మోడల్ పరీక్ష నిర్వహించారు. తొలుత డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రచురించిన డీఎస్సీ మోడల్ పేపర్‌ను డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, జిల్లా కార్యదర్శి ఇ.ఆంజనేయరాజు, యుటిఎఫ్ నాయకులు, శ్రీహరిణి అకాడమీ డైరెక్టర్ కె.నరేంద్ర ఆవిష్కరించారు. రామన్న, ఆంజనేయరాజు మాట్లాడుతూ అభ్యర్థుల్లో భయం, ఆందోళన పోగొట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రంలో ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. అభ్యర్థులకు ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ పరీక్షకు డివైఎఫ్‌ఐ ప్రచురించిన మోడల్ పేపర్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం.మోహనరావు మాట్లాడుతూ విద్య, ఉపాధి తదితర రంగాలలో యువత ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేయడంతో పాటు సామాజిక బాధ్యతగా నిరుద్యోగులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడంపై డివైఎఫ్‌ఐని మోహనరావుతో పాటు యుటిఎఫ్ నాయకులు రవిబాబు, అకాడమీ డైరెక్టర్ కె.నరేంద్ర అభినందించారు.

కొత్త విషయాలు తెలుసుకున్నాం

దాసరి సౌజన్య, బి.హారిక, డిఎస్సీ అభ్యర్థులు.

ఈ మోడల్ పరీక్షతో మాకు ఎంతో ప్రయోజనంగా ఉంది. పరీక్షల భయం పోవడంతో పాటు సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలుసుకున్నాం. డివైఎఫ్‌ఐ ప్రచురించిన మోడల్‌పేపర్‌లో ఇప్పటి వరకు తెలియని కొత్త అంశాలు పొందుపరిచారు. నిపుణులు ప్రచురించిన ఈ మోడల్ పరీక్ష అభ్యర్థులకు చాలా ప్రయోజనం కలుగుతుంది.

రేపు మాస్టర్‌మైండ్స్‌లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గుంటూరు : మాస్టర్‌మైండ్స్‌లో బోధనేతర సిబ్బంది ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 30వ తేదీ, జూన్ 1న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల హెచ్‌ఆర్ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక బ్రాడీపేట 3/11లోని మాస్టర్‌మైండ్స్ మెయిన్ క్యాంపస్‌లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చారు. 10వ తరగతి నుండి పీజీ అర్హత కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8978480429, 8978480430 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సర్వేలో పాల్గొన్న భవిత స్కూల్ ఉపాధ్యాయులు

భవిత స్కూల్ ఆధ్వర్యంలో సర్వే

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు ఎంపీపీ ఎస్ హెచ్ఇ ఇబ్బంది ఆధ్వర్యంలో వివిధ ప్రతిభవంతుల సర్వేను నిర్వహిస్తున్నట్లు భవిత స్కూల్ ఉపాధ్యాయులు బుధవారం తెలిపారు. సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు, బడి ఈడు పిల్లలను గుర్తించేందుకు జూన్ 9 వరకు మండల పరిధిలోని గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికి తిరిగి సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వే ప్రాముఖ్యతను గ్రామస్తులకు వెల్లడించారు. కార్యక్రమంలో భవిత స్కూల్ ఉపాధ్యాయులు బి సుబ్బారావు ఎస్ గణేష పాల్గొన్నారు.

నేడు మాజీ ఎంపీ హర్ష కుమార్ రాక

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలో ఇటీవల ఓ కేసులో నిందితులైన దళిత యువకులపై పోలీసుల దాడిని నిరసిస్తూ, బాధిత కుటుంబీకులను పరామర్శించేందుకు అమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్ గురువారం తెనాలి రానున్నట్లు దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి అక్కిదాసు కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. దళిత ,ప్రజా సంఘాల నేత లు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

నిందితులను పోలీసులే శిక్షిస్తే కోర్టులు ఎందుకు?

ప్రజాశక్తి తెనాలి

ఏ కేసులోనైనా నిందితులను పోలీసులే నేరుగా శిక్షిస్తే కోర్టులు ఎందుకని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఓ కేసులో నిందితులను పోలీసులు నడిరోడ్డుపై చిత్రహింసలకు గురిచేసిన ఘటన తెనాలిలో వెలుగుచూసిన నేపథ్యంలో నిజ నిర్ధారణకు పౌరహక్కుల సంఘం, మానవహక్కుల వేదిక బందం తెనాలిలో బుధవారం పర్యటించింది. బాధిత కుటుంబ సభ్యులు, పలువురు న్యాయవాదుల ద్వారా సమాచారం సేకరించారు. కానిస్టేబుల్ కన్నా చిరంజీవి కి, నిందితులు చేబ్రోలు జాన్ విక్టర్, దోమ రాకేష్, కరిముల్లా, వేము నవీన్ అలియాస్ కిల్లర్ కు మధ్య గొడవకు దారి తీసిన పరిణామాలు, నిందితులపై కేసు నమోదు, వారి అరెస్టు, అరెస్టుకు ముందు నడిరోడ్డుపై ఫిర్యాది సమక్షంలో టూ టౌన్ సిఐ రాముల నాయక్, 3 టౌన్ సిఐ ఎస్ రమేష్ బాబు విచక్షణారహితంగా లాటిలతో నడిరోడ్డుపై దాడి చేయడం, గత నెల 27 రాత్రి 11:30 సమయంలో నిందితులను మెజస్ట్రేట్ ముందు హాజరపరచడం, కనీసం వారి స్టేట్మెంట్ నమోదు చేయకుండా నిందితులకు రిమాండ్ విధించడం వంటి పరిణామాలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాల్సిన పోలీసులు బాధ్యతారహితంగా వ్యవహరించారని, ఈ ఘటనపై జిల్లా న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని, ప్రత్యక్షంగా నిందితులపై దాడి చేసిన సిఐలు ఇరువురిని, వారికి సహకరించిన కానిస్టేబుల్ను సస్పెండ్ చేయాలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిజ నిర్ధారణ కమిటీలో పౌర హక్కుల సంఘం కోశాధికారి టి రాజారావు, మానవహక్కుల వేదిక రాష్ట్ర బాధ్యులు రాయల్, న్యాయవాదులు సిహెచ్ వెంకటేశ్వరరావు బి ప్రకాశరావు ఉన్నారు.

వెళ్లడమే.. వచ్చేది లేదు..!

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుంటూ జీవించే పేదలే అధికం. పెద్ద రైతులు తమ పిల్లలను పట్టణంలోని కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకుంటున్నారు. గ్రామాల్లో వుండే ప్రభుత్వ పాఠశాలల్లో పేదలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ తరగతులకు చెందిన పిల్లలు అధికంగా చదువుతున్నారు. కొద్దిపాటి స్తోమత ఉన్న వారు ప్రభుత్వం అందించే సహాయంతో బాలురను ప్రైవేటు స్కూల్లో చదివించుకుంటూ, బాలికలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. దాంతో గ్రామీణ పాఠశాలల్లో విద్యార్థినులే అధికంగా ఉంటున్నారు. మరోవైపు ప్రభుత్వ బడుల్లో సరిపడా టీచర్లు ఉండటం లేదని, అందుకే తమ పిల్లల్ని ఆర్థికంగా భారమైనా ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నామని తల్లిదండ్రులంటున్నారు.

ఉపాధ్యాయుల కొరతతో చదువుకు దూరం..

మాచర్ల, కారంపూడి, రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి మండలాలలో, మండల కేంద్రాలకు దూరంగా, అటవీ ప్రాంతాలకు సమీపంగా వున్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వుంది. జిల్లాకు చివరన విసిరేసినట్లు వుండే భౌగోళిక స్వరూపం, సరైన రవాణా సౌకర్యం, మౌళిక సదుపాయల లేమితో కొందరు ఉపాధ్యాయులు ఆయా గ్రామాలకు వెళ్లి చదువు చెప్పేందుకు ఇష్టపడటం లేదు. డీఎస్సీ ఫలితాలు వెలువడి, నూతన నియామకాలు జరిగినప్పుడు మినహా ఆయా గ్రామాల్లోని పాఠశాలలను ఎంచుకొనే వారుండరు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లే ఉపాధ్యాయులు తప్పా, ఏమాత్రం అవకాశం వున్న బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తూంటారు. నియోజకవర్గంలో సుగాలీ, చెంచు గిరిజన తండాలు అధికంగా వున్నాయి. వారికి అన్ని వసతలు కల్పిస్తేనే చదువుకునే వారి సంఖ్య తక్కువగా వుంటుంది. అటువంటి ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరత వుండటంతో ఆప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. వారికి విద్య దూరమై బడిఈడు పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు.

231 ఉపాధ్యాయులు పోస్టులు ఖాళీలు..

మాచర్ల మండల పరిధిలో 62, ప్రభుత్వ, 6 ఎయిడెడ్ పాఠశాలలు వుండగా, 9 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 207 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా 145 మంది మాత్రమే ఉన్నారు. 62 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా వున్నాయి. వెల్దుర్తి మండలంలో 54 ప్రభుత్వ పాఠశాలలు వుండగా 4,675 మంది విద్యార్థులు చదువుతున్నారు. 178 ఉపాధ్యాయులు అవసరం కాగా 116 మంది పనిచేస్తున్నారు. 62 పోస్టులు ఖాళీగా వున్నాయి. దుర్గి మండలంలో 37 ప్రభుత్వ పాఠశాల లుండగా 4,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. 85 ఉపాధ్యాయులుకు గానూ 50 మంది పనిచేస్తుండగా, 35 పోస్టులు ఖాళీగా వున్నాయి. కారంపూడి మండలంలో 39 ప్రభుత్వ పాఠశాలలుండగా 5,200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 209 ఉపాధ్యాయులు అవసరం కాగా 39 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా వున్నాయి. రెంటచింతల మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలలు వుండగా 3,332 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉపాధ్యాయులు 119 మంది కావాల్సివుండగా 33 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా వున్నాయి. కొన్ని మండలాలలో కొన్ని సబ్జెక్టులకు అసలు ఉపాధ్యాయులే లేరు. ఏడాది మొత్తం ఖాళీగానే వున్నాయి.

ఇక్కడి నుండి వెళ్లిపోవటానికే మొగ్గు..

ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన బదిలీల ప్రక్రియలో ఐదు మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు వేరే ప్రాంతాలను కోరుకున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో ఏకోపాధ్యాయ, ఉపాధ్యాయులు తక్కువున్న పాఠశాలలు చాలా వున్నాయి. ఇప్పుడు జరుగుతున్న బదిలీల్లో చాలా మంది ఇక్కడ నుండి వెళ్లేందుకు సిద్ధపడటంతో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోతుంది. డీఎస్సీ ద్వారా కొత్తవారు వచ్చే వరకు ఆ పోస్టులు ఖాళీగా వుంటాయి. ప్రభుత్వం పాఠశాలలకు అందించే సంక్షేమ పథకాల వివరాలు సకాలంలో అందించకపోతే విద్యార్థులు నష్టపోయే అవకాశముంది. ముఖ్యంగా తల్లికి వందనం అందకపోతే విద్యార్థులకు చాలా నష్టం.

కాలనీల నిర్వహణ అధ్వానం

(మొదటి పేజీ తరువాయి)

3223 గృహాలు, పెదరావూరు-1లో 3792 ప్లాట్లు కేటాయించగా 1802 గృహాలు, పెదరావూరు-2లో 2603 ప్లాట్లు కేటాయించగా 1033 గృహాలు మంజూరయ్యాయి.

గృహ నిర్మాణాలను దృష్టిలో పెట్టుకొని అంతర్గత రోడ్లు, కల్వర్టులు నిర్మాణానికి గత ప్రభుత్వం మొత్తం రూ.7.33 కోట్లు కేటాయించింది. వీటిలో నేలపాడు-1లో 8 పనులకు సంబంధించి రూ.1.78 కోట్లు, నేలపాడు-2లో రూ.1.24 కోట్లు, బుర్రిపాలెం లేఅవుట్‌కు రూ.33 లక్షలు, పెదరావూరు-1లో నాలుగు పనులకు రూ.2 కోట్లు, పెదరావూరు-2లో పనులకు సంబంధించి రూ.21 లక్షలు ప్రభుత్వ మంజూరు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయా పనులను రద్దు చేసింది. ఫలితంగా రోడ్లు, కల్వర్టుల నిర్మాణం ఎక్కడికి అక్కడ నిలిచిపోయింది. దీంతో దాదాపు 9914 ఇళ్లకు గాను కేవలం 1174 ఇల్లు మాత్రమే

నేలపాడు జగనన్న కాలనీలో రోడ్ల దుస్థితి

పూర్తయ్యాయి. వీటికి గాను ఇప్పటికే ప్రభుత్వం రూ.61.05 లక్షలు ఖర్చు చేసింది. ఇదిలా ఉంటే తిరిగి రోడ్లు, కల్వర్టులు, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి అంచనాలు సిద్ధం చేసిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వీటికి ప్రభుత్వ ఆమోదం లభించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే వెనువెంటనే టెండర్లు ఖరారు చేసి పనులను ప్రారంభించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది గడుస్తుండగా ఇంకెంతకాలం పడుతుందోనని లబ్ధిదారులు ఆందోళనలో ఉన్నారు.

నిర్వహణను గాలికొదిలేశారు

సుంకర పద్మజ వెంకటేశ్వరరావు దంపతులు

పద్మజ, వెంకటేశ్వరరావు దంపతులు

మేము గతంలో పాండురంగపేటలో ఉండేవాళ్ల. పట్టణంలో అందరితో కలిసి ఉన్నాం. పట్టణ ప్రాంతంలోనే నివేశన స్థలాలు కేటాయిస్తారనుకుంటే నేలపాడులో కేటాయించారు. అయినా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షలకు తోడు దాదాపు మరో రూ.10 లక్షలు వెచ్చించి గృహ నిర్మాణం పూర్తి చేశాం. కానీ ఇక్కడ రోడ్లు లేవు. నివాసాలు ఉన్న ప్రాంతంలో వీధిలైట్లు వెలగవు. తాగునీరు కోసం వేసిన బోర్లలో ఉప్పు నీరు వస్తుంది. తాగునీటికి నరకయాతనే. ఇక డ్రెయినేజ్ విషయానికి వస్తే నివాస ప్రాంతాల్లోనే మడుగులు కడుతోంది. దుర్వాసన వెదజల్లుతుంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవాలి.

హడావుడి.. గందరగోళం..

(మొదటి పేజీ తరువాయి)

పాయింట్లు, సర్వీసు పాయింట్లు సరిగా నమోదు కావట్లేదని, అధికారులు వీటన్నింటినీ పరిశీలించి, సరిచేయటానికి చేయటనికి తగిన సమయం ఇవ్వకుండా డైరెక్టర్ నుండి కింది స్థాయి అధికారుల వరకూ ఒత్తిడి పెరుగుతుందనే అభిప్రాయం ఉంది. ఇప్పుడు ప్రమోషన్ల కౌన్సెలింగ్ విషయంలోనే హడావుడి చేస్తున్నారు. ఇప్పటికే ఎస్‌జిటి బదిలీల కౌన్సెలింగ్ ఉపాధ్యాయ సంఘాల కోరిక మేరకు ఆన్‌లైన్ విధానంలో కాకుండా మాన్యువల్‌గా నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. అయితే దరఖాస్తు ప్రక్రియలో, ఆ తర్వాత కౌన్సెలింగ్ ప్రక్రియలోనూ అధికారులు హడావుడి చేస్తుండంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు వారి సమస్యలకు సంబంధించి ఆన్‌లైన్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు ఇచ్చినా పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళం, ఆందోళనను తగ్గించేందుకు, ఎవరికీ ఇబ్బందులు లేకుండా చూడటానికి షెడ్యూలు ప్రకారం బదిలీలు, ప్రమోషన్ల జరపాలని కోరుతున్నారు.

పరిపాలనలో ఎన్‌టిఆర్ విప్లవాత్మక మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

పథకం కింద తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా అన్నిరాష్ట్రాల్లోని అమలు జరుగుతోందన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తేవటానికి మండల వ్యవస్థకు తెచ్చారన్నారు. డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ రామారావు సినీ, రాజకీయ రంగ ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించటంతో పాటు, పంచాయతీరాజ్‌లో మూడవ వంతు రిజర్వేషన్ కల్పించారన్నారు. ఏసురత్నం మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు అంగరక్షకుడుగా విధులు నిర్వహించటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నగర కమిషనర్ మాట్లాడుతూ రామారావు మునుసుబు, కరణం వ్యవస్థలను రద్దు చేసి రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చారన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఖాజావలి, స్టెప్ సిఇఒ చంద్రముని, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసులు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కార్డెన్‌సెర్చ్‌లో మారణాయుధాలు, వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్డెన్ సెర్చ్ లో పాల్గొన్న పోలీసులు

పల్నాడు జిల్లాలో నేరాలు నియంత్రించి, ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించనున్నట్లు నరసరావుపేట రూరల్ సిఐ పి.రామకృష్ణ అన్నారు. నరసరావుపేట మండలంలోని పమిడిమర్రు గ్రామంలో బుధవారం ఇళ్లు, పశువుల పాకలు, గడ్డి వాము ప్రాంతాలు, దుకాణాలు, బడ్డీ కొట్లలో తనిఖీలు చేసి గొడ్డళ్లు, కర్రలు, సారాతోపాటు ధ్రువపత్రాలేమీ లేని 63 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. రౌడీషీటర్లు, పాత కేసుల్లోని నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. నాటు సారా, గుట్కా వినియోగం వలన కలిగే అనర్థాలను స్థానికులకు వివరించారు. అక్రమ మద్యం జోలికి వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని పాత నేరస్తులకు సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ సిఐలు ఎంవి చరణ్, పి.హైమారావు, రూరల్ ఎస్‌ఐ కిషోర్, పట్టణ ఎస్‌ఐలు వంశీకృష్ణ, అశోక్, చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐ అనిల్, రొంపిచర్ల ఎస్‌ఐ మణికృష్ణ, ఎఎన్‌ఎస్ ఆర్‌ఐ యువరాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, గొడ్డళ్లు, కొడవళ్ళు, పలుగులు

ప్రజా ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సంక్షేమానికి అవిరళ కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు అందరికీ ఆదర్శప్రాయమని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పేదల పట్ల అచంచలమైన గౌరవం, వారి ఉన్నతికి అవిశ్రాంతంగా కషి చేసిన ప్రజా ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కష్ణయ్య, సిఎంఒహెచ్ డాక్టర్ అమతం, సిటి ప్లానర్ రాంబాబు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - యడ్లపాడు

బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై బుధవారం కారు-స్కూటర్ ఢీకొన్ని సంఘటనలో ఇద్దరు యువతులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న యడ్లపాడు పోలీసు లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఇద్దరు యువకులు స్కూటర్‌పై గుంటూరు నుంచి చిలకలూరివైపు వస్తుండగా కారు ఢీకొంది. వీరిని చికిత్స నిమిత్తం అంబులెన్సులో గుంటూరు వైద్యశాలకు తరలించిచారు. గాయపడిన వారు సూర వరపు పల్లి గ్రామానికి చెందిన మహిళా విద్యార్థులుగా గుర్తించారు.

ప్రజాశక్తి - తెనాలి

బైక్ ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ గ్రామం కాజీపేటలో 54 ఏళ్ళ వ్యక్తి నడిచి వెళు తుండగా ముగ్గురు మైనర్లు అధిక స్పీడుతో బైక్ నడుపుతూ ఢీకొట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పదవతరగతి సర్టిఫికెట్ పోయినది

నర్సారావుపేట పట్టణంలోని డోర్ నెం.12-9-12/1 ప్రకాష్ నగర్, రెడ్డిబజార్‌కు చెందిన భూమిరెడ్డి కరుణాకర రెడ్డి తండ్రి పేరు గురువారెడ్డి, నర్సారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాష్ నగర్ నుండి షాలిమ్ నగర్ కు సర్టిఫికెట్లు తీసుకుని వ్యక్తిగత పని నిమిత్తం బైకుపై వెళ్ళుతుండగా పదవతరగతికి సంబం ధించిన మార్కుల మెమో రోల్ నెం. 0919107 మార్గం మధ్యలో ఎక్కడో పోయి నది. ఎవరికైన దొరికిన యెడల ఫోన్ నెం.9885243822 సమాచారం ఇవ్వగలరని మనవి.

రక్తపు వాంతులతో బాధపడే రోగికి డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేగు లోపల రక్త నాళం పగిలి కడుపులో రక్తం కారుతూ రక్తపు వాంతులు, లో-బిపితో ప్రాణాపాయ స్థితిలో తమ హాస్పిటల్‌కు వచ్చిన బాధితునికి డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి అత్యవసర చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఎండో స్కోపి ద్వారా పేగు లోపలి రక్తనాళం పగిలి రక్తం లీకవుతున్నట్లు గుర్తించి అడ్వాన్సుడ్ ఎండోస్కోపిక్ పరికరం



అడ్వాన్సుడ్ ఎండోస్కోపిక్

ఉపయోగించి ఎండోస్కోపి క్లిప్పింగ్ అధునాతన పద్ధతి ద్వారా లీకైన రక్తనాళాన్ని ఎండో స్కోపీ ద్వారా క్లిప్పింగ్ అమర్చి రక్తం లీకు అవ్వడాన్ని నిలిపి రోగి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భం లగా డాక్టర్ లోకిరెడ్డి శ్రీని వాస్‌రెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో సూపర్ స్పెషాలిటీ, ఈఎస్ఐ వైద్య సేవలు ఇతర అన్ని విభాగాల వైద్య సేవలు తమ హాస్పిటల్‌లో నిపుణులైన వైద్య బృందం అందుబాటు లో ఉండి 24/7 వైద్య సేవలు అందిస్తున్నామ న్నారు. తమ వైద్య సేవలను పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు

అమరావతి - ప్రజాశక్తి

స్థానిక రామలింగేశ్వర స్వామి వారి ఆలయ ఆదాయానికి దేవదాయ శాఖ అధికారులు గండి కొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. అమరావతి ప్రధాన రహదారిలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయం ప్రాంగణంలో 32 దుకాణాల షాపులకు గత ఎన్నో ఏళ్లుగా బహిరంగ వేలం నిర్వహించకుండా ప్రస్తుతం లీజు గడువు పూర్తి అయిన బహిరంగ వేలం పాటలు నిర్వహించకుండా పాత వారికే అప్పజెప్పేలా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారంటే కారణం ఏమిటంటూ స్థానిక ప్రజలుఆరోపణలు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని 32 దుకాణాలకు వేలం నిర్వహించి అద్దెలకు కేటాయించారు. దుకాణాలు పాడుకున్న లీజు దారులు దేవాదాయ శాఖకు ఒక్కో దుకాణానికి కేవలం నామ మాత్రపు అద్దె చెల్లిస్తూ సంబంధిత దుకాణాల లీజు దారులు ఆ దుకాణాలను వేరే వారికి అద్దెకు ఇస్తూ నెలకు ఒక్కో దుకాణానికి 15వేల నుంచి 20వేల రూపాయల వరకు వసూలు చేస్తూ ఆలయ ఆలయానికి గండి కొడుతున్నారు. లీజు దారులు గత ప్రభుత్వంలో స్థానిక నాయకుల అండతో బహిరంగ వేలం పాట నిర్వహించకుండా దేవదాయ శాఖ అధికారులపై ఒత్తిడి చేస్తూ వస్తూ ఉన్నారు. ప్రస్తుతం ఆలయ దుకాణాలకు వేలం పాటలు నిర్వహించకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులు పైస్థాయిలో పైరవీలు చేస్తూ కేవలం 30 శాతం అద్దెలు పెంచి ఇస్తామని లీజుదారులు దేవదాయ శాఖ అధికారులకు దరఖాస్తులు చేసి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.అలా పెంచిన కేవలం 2000 కు మించి అద్దె రాదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్నప్పటికీ ఆలయ దుకాణాల్లో మాత్రం ప్రతిపక్ష పార్టీ నాయకులు హవా మాత్రం తగ్గలేదని బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి.ఇప్పటికైనా స్థానిక నాయకులు కలగజేసుకొని బహిరంగ వేలంపాటలు నిర్వహించి ఆలయానికి ఆదాయం వచ్చేలా పనిచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బిఎస్సీ నర్సింగ్ లో చేరేవారికి కన్వీనర్ కోటా, మేనేజ్మెంట్ కోటా

ప్రజాశక్తి - నరసరావుపేట టౌన్ : 2025-2026 వ సంవత్సరం బీఎస్సీ నర్సింగ్ నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సులో ఎశీఅయ్యే విద్యార్థులకు (కన్వీనర్ కోటా మరియు మేనేజ్మెంట్ కోటా) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని ఎంఎం గ్రూప్ ఆఫ్ కళాశాలల అధినేత మేదరమెట్ల రామ శేషగిరిరావు ఒక క్రటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షకు నోటిఫి కేషన్ 2025 ఈనెల 28వ తేదీన జారీ చేయబడిందనీ, ఆన్‌లైన్ దరఖాస్తులు 28వ తేదీ నుంచి జూన్20, 2025వరకు https:// drntr.uhsap.in ద్వారా అందుబాటులో ఉంటాయని అన్నారు . హాల్ టిక్కెట్లు 2025 జూన్ 25 వ తేదీ ఉదయం 10:00 గంటల నుండి https:// drntr.uhsap.inలో కూడా డౌన్ లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంటాయని ప్రవేశ పరీక్ష జూలై 6 వ తేదీ ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు జరగనుందని తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఉదయం 9:00 గంటలకు రిపోర్టింగ్ చేయాలన్నారు. తాత్కాలిక సమాధానాలకి 2025 జూలై 7వ తేదీన విడుదల చేస్తారనీ, అభ్యంతరాలను జూలై 7 నుండి జూలై 9 వ తేదీ వరకు సమర్పించవచ్చన్నారు. ఫలితాలు డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వెబ్‌సైట్‌లో ప్రదర్శించబడతాయని తెలియచేసారు.

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ విజయవాడలో

C.C. No. 1 / 2025

బిట్వీన్:

కోలా శ్రీనివాసరావు ...కంప్లైనెంట్

మరియు

మెస్సర్స్. నవయుగ టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ & అనదర్ ...ఆపోజిట్ పార్టీస్

టు,

1వ ఆపోజిట్ పార్టీ: మెస్సర్స్. నవయుగ టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిప్ బై మేనేజింగ్ డైరెక్టర్ గోగున జవహర్ బాబు.

2వ ఆపోజిట్ పార్టీ: గోగున జవహర్ బాబు, తండ్రి. సూర్య నారాయణ, మేనేజింగ్ డైరెక్టర్, మెస్సర్స్. నవయుగ టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నెం.101, హోలీ హోమ్స్, పోస్టల్ కాలనీ 3వ లైను, చిల్డ్రన్ పార్కు దగ్గర, అమరావతి రోడ్డు, గుంటూరు.

పై నెంబరు C.C లో 1&2 ఆఫోజిట్ పార్టీలు అయిన మీకు గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల కమీషన్ వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున గౌరవ కమీషన్ వారు మీకు నోటీసును ఈ పేపర్ ప్రకటనద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:30-06-2025న ఉ.గం.10-30 ని.లకు పై తెలిపిన శ్రీయుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల కమీషన్ వారి యెదుట మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొన వలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

(శ్రీయుత రాష్ట్ర వినియోగదారుల కమీషన్ వారి అనుమతితో)

కడియాల శ్రీరాములు(శ్రీరామ్), షేక్ సనావుల్లా మొహమ్మద్,
కంప్లైనెంట్ తరపు న్యాయవాదులు, జిల్లా కోర్టు ఎదురు, గుంటూరు.సెల్: 9493642338

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ విజయవాడలో

F.A. No. 52/ 2025 in C.C. No. 253/2022

(గుంటూరు జిల్లా వినియోగదారుల ఫోరమ్ గుంటూరు వారి ఫైలు)

బిట్వీన్:

ఆలపాటి గోపాలకృష్ణ వగైరాలు ...అప్పీలెంట్స్

మరియు

పఠాన్ సర్తాజ్ బేగం వగైరా ...రెస్పాండెంట్స్

టు,

2వ రెస్పాండెంట్: నందిపాటి రమాదేవి, భర్త. సత్యనారాయణ, నివాసం: తక్కెళ్ళపాడు గ్రామం, గుంటూరు(మం& జిల్లా).

పైనెంబరు అప్పీలు పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు పైస్టేట్ కమీషన్‌వారి ద్వారా, నోటీసు పంపిననూ మీకు ముట్ట నందున మీకు ఈపేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసి నదిగా స్టేట్‌కమీషన్ వారు ఆర్డరువేస్తూ **ది.16-06-2025**కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు **ఉ॥గం॥10-30ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది.16-06-2025

షేక్ సనావుల్లా మొహమ్మద్, అప్పిలెంట్స్ తరపు న్యాయవాది
జిల్లా కోర్టు ఎదురు, గుంటూరు.సెల్: 9493642338

సత్తెనపల్లి పురపాలక సంఘ కార్యాలయము.

ఆర్.ఓ.సి.నెం.113/2021/ఏ1 తేది. 28-05-2025

షాపు రూముల బహిరంగ వేలము ప్రకటన - 2వ కాల్

సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో గల (1) N.T.R. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెంబర్లు 8,9,16,20,22,23,24,25,26,27,28,29,30,32,33,35,36,37 మరియు 38 (2) శ్రీవావిలాల గోపాల కృష్ణయ్య కాంప్లెక్స్ నందలి షాపు నెంబర్లు 1,2,3,4,5,7,8,16, ఫస్ట్ ఫ్లోర్ మరియు సెకండ్ ఫ్లోర్ ఓపెన్ హాల్ (3) శ్రీ వై.వి. రెడ్డి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెంబర్లు 14,17,18 మరియు బి బ్లాక్ (4) శ్రీమతి గంటా సరస్వతి & రోశయ్య మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు రూము నెం. 2 (5) రాజీవ్ గాంధి కూరగాయల మార్కెట్ నందలి షాపు నెంబర్లు 3,4,5,8,17,18,19,27,28,29,30,38,39,40,41 మరియు 42 షాపులు నిర్ణయించిన నెలసరి అద్దె పై బహిరంగ వేలమును తేది.11-06-2025న బుధవారం ఉదయం 11.00 గంటలకు మునిసిపల్ కార్యాలయము నందు మునిసిపల్ కమీషనరు గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన అధికారి వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు బహిరంగ వేలమునకు సంబంధించిన పూర్తి వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు అడిగి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనరు,
సత్తెనపల్లి పురపాలక సంఘం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గాయపడిన సప్పవరపు వెంకటేశ్వర్లు, వి నాగరాజు, వి దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - ఈపూరు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలం లోని కూచిన పల్లి గ్రామ సమీపంలో వినుకొండ- కారంపూడి ప్రధాన రహ దారిపై బుధ వారం జరిగింది. గురజాలకు చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వినుకొండలో శుభకార్యానికి హాజరై తిరిగి గురజాల వైపు వెళుతుండగా కూచిన పల్లి వద్ద సప్పవరపు వెంకటేశ్వర్లు టీవీఎస్ ఎక్సెల్‌పై పొలం దాటుతుండగా వేగంగా ఢీకొట్టడంతో వెంకటేశ్వర్లకు తీవ్ర గాయాల య్యాయి. ద్విచక్ర వాహనంపై ఉన్న వి.నాగరాజు, వి.దుర్గాప్రసాద్‌కు తీవ్రంగా యాలు కాగా క్షత గాత్రులను ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలిం చారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఫ్యాన్‌కి ఉరి వేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండలానికి చెందిన మన్నవ జేమ్స్ భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. జేమ్స్ వృత్తి రీత్యా సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నారు. తన కుమారుడైన మన్నవ స్టాలిన్, (17) అడవి తక్కేళ్ళపాడు గ్రామంలోని ఎంజిఎస్ కాలేజీలో ఐటిఐ ఎలక్ట్రికల్ చదువుతున్నారు. ఈ నెల 27 తేదీన రాత్రి 07.45 నిమిషాలకు కూరగాయలు కొనుక్కునేందుకు బయటకు వెళ్లిన జేమ్స్ భార్య యేసు కుమారి ఇంటికి వచ్చే సరికి స్టాలిన్ ఇంటి వరండాలోని సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతుండడం చూసి పెద్దగా కేకలు వేయగా చుట్టుప్రక్కల వారు వచ్చి స్టాలిన్‌ను కిందకు దించారు. వెంటనే విషయాన్ని జేమ్స్‌కు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఆయన వచ్చి వెంటనే ఆర్ఎంపి డాక్టర్ వద్దకు తీసుకెళ్లగా పరీక్షించి అప్పటికే స్టాలిన్ మృతి చెందినట్లు తెలిపారు. జేమ్స్ ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కే.నాగేంద్ర తెలిపారు.

పజలకు మరింత చేరువయ్యేందుకే 'పల్లె నిద్ర'

ప్రజాశక్తి - క్రోసూరు

పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం "పల్లె నిద్ర" కార్యక్రమాన్ని ప్రతి వారం జిల్లా పోలీస్ అధికారులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. క్రోసూరు మండల ఎస్సై రవిబాబు క్రోసూరు మండల పరిధిలోని గ్రామాలలో బస చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి విప్పర్ల సమీపంలోని గోవిందాపురంలో పల్లెనిద్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి, సైబర్ నేరాలు జరుగుతున్న తీరును గురించి వివరించారు. జూదం, కోడి పందాలు ఇతర అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారి వివరాలు, అక్రమ మద్యం, గంజాయి విక్రయాలకు పాల్పడే వారిని గురించిన సమాచారం స్థానిక ప్రజల నుండి తెలుసుకున్నారు. స్థానికంగా కొత్త వ్యక్తులు సంచరిస్తున్న, నివాసం ఉంటున్న, అసాంఘిక కార్యకలాపాలు గురించిన సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు (లేదా) 112, 100 నంబర్లకు కాల్‌చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ప్రజలకు తెలిపారు.

వైసిపి బూత్ కమిటీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్రా చిన్నకోటేశ్వరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వైఎస్ఆర్సిపి బూత్ కమిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను ఎన్నుకున్నట్లు వైసిపి కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసిందని గురజాల పట్టణానికి చెందిన కర్ర చిన్న కోటేశ్వరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నరసరావుపేటలో గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డిని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఇంటర్ పూర్తయిన వారికి ఉచిత కోడింగ్ శిక్షణ

ప్రజాశక్తి - వినుకొండ

ఇంటర్ ఎంపీసీ పూర్తిచేసి బీటెక్‌లో చేరబోయే విద్యార్థిని, విద్యార్థులకు ఉచి తంగా కోడింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఇందూరి రామాంజి రెడ్డి (ఐఐటీ బాంబే) ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ 1వ తేదీ నుండి సాయంత్రం 05 గంటలకు విఠం రాజు పల్లి సాయి బాబా గుడి దేవస్థానం ప్రక్కన ఉన్న తమ ఇనిస్టిట్యూట్‌లో హాజరు కావాలన్నారు. శిక్షణ కొరకు వచ్చే విద్యార్థిని, విద్యార్థులు మొబైల్ ఫోన్ కానీ ల్యాప్టాప్ లేదా ట్యాబ్ కచ్చితంగా తీసు కొని రావాలని తెలియజేశారు.

కేక్‌ను కట్ చేస్తున్న జున్నా శ్రీనివాసరెడ్డి

న్యూటన్స్ ఇంజనీరింగ్ కాలేజీకి అటానమస్ స్టేటస్

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మండల పరిధిలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కాలేజీకి అటానమస్ స్టేటస్ లభించినట్లు సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాలేజి ఆవరణలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో 25 ఏళ్ల నుండి ఉత్తమ విద్యాబోధన చేస్తున్న తమ కాలేజీకి అటానమస్ స్టేటస్‌ను ప్రభుత్వం ప్రకటించటంపై హర్షం వ్యక్తం చేశారు. దీని వల్ల తమ కాలేజీలో మరింత మెరుగైన సిలబస్‌ను రూపొందించుకునే అవకాశం, పరీక్ష విధానం ఉంటుందన్నారు. యుజిసి ప్రకటించిన ఈ గుర్తింపు వచ్చేందుకు తమ కాలేజీలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సుదీర్ఘకాలంగా చేస్తున్న విశేష కృషి కారణమని చెప్పారు. వారితోపాటు ప్రిన్సిపాల్ జి.జగదీశ్వరరెడ్డి కలిసి అభినందించారు.

5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : మాచర్ల కోర్టు వద్ద వచ్చేనెల 5వ తేదీన జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగపరుచుకోవాలని మాచర్ల అదనపు సివిల్ జడ్జి పి.ప్రశాంత్ కోరారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, భరణం, గృహహింస, బ్యాంకు కేసులు, క్రిమినల్ కేసులు, ముందస్తు రాజి చేసుకోదలచిన కేసులను ఇరుపక్షాల మధ్య సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని చెప్పారు.

పాలకేంద్రం అధ్యక్షునిగా అమరలింగేశ్వరరావు ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-ముప్పాళ్ల : మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో సంగం డెయిరీ ఒకటవ పాల కేంద్రం అధ్యక్షునిగా కౌలురైతు సంఘం మండల కార్యదర్శి తోరటి అమరలింగేశ్వరరావు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని అన్ని పార్టీల సభ్యులు ఆయనకు మద్దతిచ్చి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమరలింగేశ్వరరావును చాగంటివారిపాలెం గ్రామఉప సర్పంచ్ అన్నపురెడ్డి రంగారెడ్డి, గొలమారి రామిరెడ్డి సత్కరించారు.

ఐటిసిని నిలబెట్టిన రైతుల్ని ఆదుకోండి

- డివిజన్ అసిస్టెంట్ మేనేజర్‌కు రైతుసంఘాల సమన్వయ సమితి వినతిపత్రం
- ముగిసిన రైతుల దీక్షలు - ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రైతుల వద్ద ఉన్న పొగాకును మద్దతు ధరకు కొనేందుకు ఐటిసి సత్వరమే కొనుగోలు చేంద్రాలను ప్రారంభించాలని రైతు సంఘాల సమన్వయ సమితి కోరింది. ఈ మేరకు ఐటిసి డివిజన్ అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చింది. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లో గల ఐటిసి ప్రధాన కార్యాలయం వద్ద రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల పొగాకు రైతులు చేపట్టిన దీక్షలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా నల్లమడ రైతుసంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ 1912లో ఏర్పాటైన ఐటిసికి ఇప్పటి వరకూ రైతులు అండగా ఉంటూ వచ్చారని, వారివల్లే కంపెనీ ఎదిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఇబ్బందుల్లో ఉన్న రైతుల వద్ద నుండి పొగాకును కంపెనీ కొని ఆదుకోవాలని కోరారు. రైతుసంఘం నాయకులు నూతలపాటి కాళిదాసు మాట్లాడుతూ కంపెనీ మేనేజర్లతో సిఎం, వ్యవసాయ శాఖ మంత్రులు మాట్లాడినట్లు చెప్పారని, పొగాకును కొంటారని మాయమాటలు చెప్పారని, అయితే ఎప్పుడు కొంటారు? ఎంతకు కొంటారో మాత్రం చెప్పలేదని విమర్శించారు. దీనిపై స్పష్టమైన ప్రకటనతోపాటు త్వరగా కొనిపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతులు అప్పులపాలై వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా చితికిపోయారని, అప్పులు చెల్లించాలనే ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని తెలిపారు. ఫిబ్రవరిలో వేసిన పొగాకు వర్షం బారిన పడిన నేపథ్యంలో దాన్ని కూడా కొనాలని, అవసరమైతే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలని కోరారు. రెండో రోజు దీక్షలను ప్రారంభించిన రైతుసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు టి.బాబురావు మాట్లాడుతూ ఐటిసిపై నమ్మకంతో స్నన్న, చిన్నకారు రైతులు చాలామంది పొగాకును సాగు చేశారని, వారిని మోసం చేయొద్దని కోరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రానికి నూతన దశ, దిశ చూపిస్తానని ప్రకటిస్తున్న టిడిపి మహానాడులో ఒక సానుకూల నిర్ణయం తీసుకొని రైతుల వద్ద పంటలను కొనాలని, ఈ మేరకు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పంటల కొనుగోలుపై ఒక విధానపరమైన నిర్ణయాన్ని ప్రకటించాలన్నారు. చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, లాయర్లు ఈపూరి బ్రహ్మానందం, ఆర్.వెంకటేశ్వరరావు, ఎం.ఉపేంద్ర, భానుప్రసాద్ తదితరులు రైతు దీక్షలకు మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా దీక్షల్లో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు హనుమంతరెడ్డి, డి.వరహాలు, ఎస్.కె.నజరుద్దీన్, భవాని వెంకటేష్, కె.ప్రసన్నకుమార్, కె.అనిల్ కుమార్, ఎం.శివప్రసన్న బాబు, ఎ.సుబ్బారావు, జె.మరియుదాసు, ఎస్.లూథర్ కూర్చున్నారు. ఎస్కే సుభాని, పి.రామారావు, ఎన్.శివ, రైతులు పాల్గొన్నారు.



అమ్మొద్దని ఫోన్ చేశారు.. ఇంకా కొనలేదు..

ఎనిమిదెకరాల్లో పొగాకు సాగుచేయడానికి రూ.10 లక్షల వరకు ఖర్చయింది. 95 క్వింటాళ్ల దిగుబడి రాగా 20 క్వింటాళ్లను రూ.80 వేలకు అమ్ముకున్నాను. ఆ డబ్బులు వడ్డీలకు, కూలీలకే సరిపోయింది. ఈ క్రమంలో సర్వే సిటిజన్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. తొందరపడి అమ్ముకోవద్దని త్వరలో మంచి రేట్లతో కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికీ కొనలేదు.

నిడుబ్రోలు వెంకటనారాయణ.
అన్నారం, పెదనందిపాడు మండలం.

శకుంతల జనరల్ అండ్ గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

హైదరాబాద్, విజయవాడ వంటి మహానగరాలకు దీటుగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో అరుదైన వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారనడానికి నిదర్శనంగా శకుంతల జనరల్ అండ్ గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్ (డాక్టర్ దత్తు గారి హాస్పిటల్) నిలిచింది. హాస్పిటల్ అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాస్ 26 ఏళ్ల వయసు గల 7 నెలల గర్భిణీకి విజయవంతంగా ఎండోస్కోపి ద్వారా కోత, కుట్లు లేకుండా నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైంది. ఈ సందర్భంగా బుధవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన

విలేకరుల సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తీవ్రమైన కడుపు నొప్పితో వచ్చిన 7 నెలల గర్భిణీకి ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా పసరునాళం లోనికి జారిన రాళ్ల వల్ల కామెర్లు సోకినట్లు గుర్తించామన్నారు. పరిస్థితిని ఆమె భర్త అన్వేష్‌కు, ఇతర కుటుంబ సభ్యులకు వివరించి ఎండోస్కోపి ద్వారా కోత, కుట్లు, రేడియేషన్ లేకుండా ఇఆర్‌సిపి (ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ చోలాంగియో పాంక్రియాటో గ్రఫీ) అరుదైన శస్త్ర చికిత్స ద్వారా పసరునాళానికి స్టంట్ అమరిక ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని వివరించారు. ఈ తరహాలో గర్భిణీ మహిళకు అందించిన చికిత్స విజయవంతంగా పల్నాడులో మొట్టమొదటిసారి నిర్వహించడం, దానికి తమ హాస్పిటల్ వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. ప్రజలు ప్రధానంగా గర్భిణులు కామెర్లు, కడుపు నొప్పిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులు సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. తమ హాస్పిటల్‌లో జనరల్, గ్యాస్ట్రో, లివర్ వ్యాధులకు సంబంధించి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్యసేవలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఉపాధిహామీ కూలి

- రికార్డుల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న ఇతర ప్రాంతాల్లోని విద్యార్థులు
- నలుగురి పని ఒక్కరే చేసి ఒక కూలి తీసుకుంటున్న వాస్తవ కూలీలు

కామేపల్లికి చెందిన వ్యక్తి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటూనే తన సొతూళ్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా పంట కాల్వను తవ్వుతున్నాడు. బ్రాహ్మణపల్లికి చెందిన ఒక విద్యార్థి గుంటూరులో చదువుతుండగా, అతని కుటుంబం మొత్తమూ గుంటూరులో స్థిరపడినా ఊళ్లో మాత్రం ఉపాధి హామీ కూలీగా ఇంగుడు గుంత తీస్తున్నారు. విశాఖలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మరొక వ్యక్తి కూడా సొంతూరైన జూలకల్లులో పొలం బాటలు వేసే పనిలో ఉపాధి హామీ కూలీగా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాడు.. ఈ విడ్డూరమంతా పిడుగురాళ్ల మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది మహిమ...

ప్రజాశక్తి-పిడగురాళ్ల

పిడుగురాళ్ల మండలంలో 17 గ్రామ పంచాయతీలకు గాను 10 వేలకు పైగా ఉపాధి హామీ జాబ్ కార్డులున్నాయి. 2025-26 సంవత్సరంలో 2.65 లక్షల పనిదినాలు లక్ష్యంగా అధికారులు ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి 100 రోజులు పనిదినాలు కల్పిస్తామని, రోజుకూలి రూ.300 వరకు పడేలా పనులు చేయిస్తామని చెప్పారు. పొలం బాటలు, పంట కాల్వలు, ఇంకుడు గుంతలు పనులను ప్రధానంగా గుర్తించి చేయిస్తున్నారు.

ఉపాధి హామీ చట్టం కింద పనులంటే చాలా తేలిక.. ఇలా వెళ్లి అలా వస్తే చాలు కడుపులో నీళ్లు కదలకుండా కూలి వచ్చేస్తుంది.. అనే భావన చాలా మందిలో వ్యక్తమవుతుంది.. అయితే పని ఏమీ చేయకుండా డబ్బులు రావనేది నిజమే అయినా పిడుగురాళ్లలో అయితే ఒక్కొక్క కూలి ముగ్గురు నలుగురు పని చేస్తేగాని ఒక కూలి రావడం లేదు. ఇందుకు సిబ్బంది అవినీతి కారణంగా తెలుస్తోంది. వ్యవసాయ పనుల్లేని రోజుల్లో కూలీల పనులు కల్పించడం ద్వారా వలసలను నివారించడంతోపాటు గ్రామాభివృద్ధికి దోహదకారిగా నిలిచే ఉపాధి హామీ చట్టాన్ని అక్రమార్కులు తమ జేబులు కుక్కుకోడానికి వాడుకుంటున్నారు. 10 మంది కూలీలనే పనిలో పెడుతూ హాజరుమాత్రం 30 మందికి వేస్తూ ఆ డబ్బును నొక్కేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారిని, ఉద్యోగాలు చేసుకుంటున్న వారిని కూలీలుగా నమోదు చేసి అవినీతికి పాల్పడుతున్నారు. అదనంగా నమోదు చేసిన కూలీల పనిని వాస్తవంగా పనిలో ఉన్న కూలీలే చేస్తున్నారు. కొన్నిసార్లయితే చేసిన పనినే మళ్లీ చేసినట్లు నమోదు చేస్తున్నారు.

సిబ్బంది తమకు అనుకూలంగా ఉండే వారికి జాబ్ కార్డులు ఏర్పాటు చేసి వారు పనులకు రాకపోయిన వచ్చినట్లు హాజరు వేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉన్న ఫొటోల్లో ఇద్దరు, ముగ్గురితో కలిపి అప్‌లోడ్ చేసి పదిమంది పనిలో పాల్గొనట్లు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ గౌరవ వేతనం తీసుకునేవారు, బెంగుళూరు,హైదరాబాద్ విశాఖపట్నం

తదితర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాల్లో డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుకునేవారు ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల జాబితాల్లో నమోదవుతున్నారు. వీరికి వచ్చే కూలిని సగం వారికి, సగం సిబ్బంది పంచుకుంటున్నారు. అయినా వీరిని కట్టడి చేసేవారు కరువయ్యారు. తనిఖీలూ లేవు. దీంతో వాస్తవంగా ఉపాధి పొందాల్సిన పేద కూలీలు అన్యాయానికి గురవుతున్నారు. గతంలో ఉపాధి పనుల నిర్వహణ సమయంలో ఏపీవో, జెఇ, టిఏలు తదితర మండల, జిల్లాస్థాయి అధికారులు రోజుమార్చి రోజు పరిశీలించేవారు. ఇప్పుడవేమీ లేకపోవడంతో అక్రమార్కులదే రాజ్యమైంది.

బీజేపీ దుష్ట ప్రయత్నాలను తిప్పికొట్టాలి..

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

బిజెపి దుష్ట ప్రయత్నాలను, దేశ సమగ్రత పరిరక్షణకై వామపక్షాలు, లౌకికవాదులు, మేధావులు సంఘటితంగా ఉండి తిప్పి కొట్టాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు అన్నారు. పహల్గామ్‌లో ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా, మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకై కాజా గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సమైక్యత సభ నిర్వహించారు. సభకు సిపిఎం నాయకులు తమ్మా ప్రసాదరెడ్డి అధ్యక్షత వహించారు. సభలో అప్పారావు మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రవాదుల దాడులను దేశవ్యాప్తంగా వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ, ఇక్కడ లౌకిక పార్టీలు ఖండించాయన్నారు. ఉగ్రవాదులు 26 మంది టూరిస్టులను చంపటం దారుణమని అన్నారు. నిఘవర్గాలకు ఉగ్రవాద చర్యలు ముందే తెలిసి హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. యుద్ధం చేస్తున్నామని చెప్పి పాకిస్తాన్ ఆక్రమిత ఉగ్రవాద సంస్థలపై దాడులు చేయడం జరిగిందని అన్నారు. ఆ దాడుల్లో పహల్గామ్‌లో టూరిస్టులను చంపిన ఉగ్రవాదులు ఉన్నారా అని ప్రశ్నించారు. దేశ ప్రజలకు వాస్తవాలు చెప్పడం లేదని విమర్శించారు. ముస్లిం అంటేనే ఉగ్రవాదులనీ బిజెపి, దాని అనుబంధ పరివార సంఘాలు మాట్లాడడం సబబు కాదని అన్నారు. మణిపూర్‌లో 250 మంది హత్యలు, అత్యాచారాలకు గురైన సంఘటనలు ఉన్నాయని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆ ప్రాంతాన్ని ఇంతవరకు సందర్శించలేదని విమర్శించారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడుల్లో చనిపోయిన వారిని పరామర్శించకుండా, ప్రధాని నరేంద్ర మోడీ బీహార్ ఎన్నికల ప్రచారంలో ఉన్నారని విమర్శించారు. దేశంలో ప్రస్తుతం సమైక్యతకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. సంఘపరివారశక్తులు దేశాన్ని మతాలవారీగా విభజించడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఉగ్రవాదుల దాడిలో కొంతమంది హిందువులను ముస్లిం సోదరులు కొంతమందిని తమ ప్రాణాలను అడ్డుపెట్టి కాపాడారని తెలిపారు. నరేంద్ర మోడీ దొంగల నాయకుడిగా ఉన్నారని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కలగజేసుకొని మాట్లాడుతుంటే దేశ ప్రధాని మోడీ నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. గుజరాత్ పెట్టుబడిదారుల వ్యాపారాల వరకు యుద్ధాన్ని నిలిపివేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు అయిన టిడిపి, జనసేన, వైయస్సార్ పార్టీలు మోడీ భజన చేస్తున్నాయని విమర్శించారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడింది కమ్యూనిస్టులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహారావు, ఎస్. సుమ, ఎస్.నిర్మల, బి.కోటేశ్వరి, ఆదిశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈమని అప్పారావు

కూలీలతో మాట్లాడుతున్న బాలరాజు

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోన్న కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - దుగ్గిరాల

కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మపూడి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు పలు సమస్యలు బాలరాజు దృష్టికి తీసుకొచ్చారు. ఆరు వారాలుగా వేతనాలు పడలేదని, గతంలో సమ్మర్ అలవెన్స్ మజ్జిగ, మంచి నీళ్ళ, పలుగులకు, పార్లకు సానకు డబ్బులు వేసేవారని, టెంటు మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచేవారని తెలిపారు. బాలరాజు మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 20,000 కోట్లు బడ్జెట్ తగ్గించిందని, వంద రోజులు పనులు ఎక్కడ జరగటం లేదని వ్యవసాయ కూలీలకు పనులు లేక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎం.నందయ్య, వి.సీతారామయ్య ఎం.లక్ష్మణరావు సిహెచ్.శ్రావణి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం పెదనందిపాడులోని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల దిగుబడి, మంచి ధర సూచి ఈ సంవత్సరం మండలంలోని అనేకమంది పేద రైతులు నల్ల బర్లీ పొగాకు వేశారని, గత సంవత్సరం 18 వేలు కొన్న పొగాకు ఈ సంవత్సరం నాలుగు వేలకు కూడా కొనే నాధుడే లేక దిక్కు తోచని స్తితిలో ఉన్నారని తెలిపారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య , జిల్లా రైతు సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు పాశం రామారావు, కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి కొరివి వినయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు నర్రా బాలకృష్ణ, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ పార్టీ నాయకులు ఖాశింపీరా, రాంబాబు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

మాట్లాడుతున్న కమిషనర్ అలీం భాష

అంకిత భావంతో పని చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజారోగ్యం పట్ల అంకిత భావంతో పని చేయాలని కమిషనర్ అలీం బాషా సిబ్బందిని ఆదేశించారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఈద్గా కళ్యాణ మండపంలో ఫ్రైడే - డ్రైడే, దోమల నివారణ, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సి చర్యలపై ఏఎన్ఎంలకు, శానిటేషన్ సెక్రటరీలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాకాలం ముందుగా రావడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, వైరల్ జ్వరాలు, డయేరియా ప్రబలుతోందన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలలో నీటి తొట్టెలు, పూల కుండీలు, రోలులలో, ఫ్రిడ్జ్‌లు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. నిల్వ ఉన్న నీటిలో లెడ్ టార్చితో లార్వాని గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించి నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కే శకుంతల, ఇందిరానగర్ మెడికల్ అధికారిని డాక్టర్ అనూష, డిప్యూటీ కమీషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరావు, ఎంపిహెచ్ఈ ఓ వెంకటేశ్వరావు, ఏఎన్ఎంలు, శానిటేషన్ సెక్రటరీలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన డిఆర్ఎం

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణంలో గల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం డిఆర్ఎం సుధేష్ణ తనిఖీ చేశారు. అమృత పథకములో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.12 కోట్ల 56 లక్షల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్లాట్ ఫామ్స్, వెయిటింగ్ హాల్స్, కోచ్ ఇండికేషన్ బోర్డులు, పార్కింగ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడిఆర్ఎం సైమన్, డీఈఎన్ కోఆర్డినేషన్ జేవి అనూష, గతి శక్తి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ మనోహర్ రెడ్డి, డీసీఎం కమలాకర బాబు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల వద్ద పార్కు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రజలకు మరో ఆరు నెలల్లో అద్భుతమైన పార్కు అందుబాటులోకి రానుందని కమిషనర్ అలీమ్ భాష తెలిపారు. అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయాల వద్ద నూతనంగా నిర్మించనున్న పార్కుకు బుధవారం భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ అలీమ్ భాష మాట్లాడుతూ రాష్ట్రమంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ సూచనల మేరకు నగర పాలక సంస్థకు చెందిన మూడు ఎకరాలు, ఏపీఐఐసీకి చెందిన మరో మూడు ఎకరాలు మొత్తం ఆరు ఎకరాల విస్తీర్ణంలో పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రూ 9 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ పార్కు ఫిబ్రవరి నాటికి ప్రజలకు అందుబాటులోకి రానుందని తెలిపారు. అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకి దేవి, టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, గోవాడ రవి, జనసేన నాయకులు, తిరుమల శెట్టి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు శంకుస్థాపన చేస్తున్న కమిషనర్

బీఎస్సీ నర్సింగ్‌కోర్సు ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తెనాలి

బీఎస్సీ నర్సింగ్ నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు ప్రవేశ పరీక్షకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మార్తా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ యనమల ఈశ్వర్ చెప్పారు. స్థానిక కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి బీఎస్సీ నర్సింగ్ కోర్సులో కన్వీనర్, మేనేజ్మెంట్ కోటాలలో సీట్ల భర్తీకి విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వెబ్సైట్‌లో ఈ నెల 28నుంచి, జూన్ 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష తెలుగు ఇంగ్లీష్ మీడియంలో జూలై 6వ తేదీన నిర్వహిస్తారన్నారు. ఓ.సి. అభ్యర్థులు రూ. 1180, బిసి,ఎస్సి,ఎస్ .టి.లు అయితే 944 రూపాయలు ఫీజు చెల్లించాలని, బ్యాంకింగ్ చార్జీలు అదనంగా ఉంటాయని, జీఎస్టీతో కలుపుకొని, ఈ ఫీజులు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు 9703353737, 93476 53737, 98663 49509 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వివరాలు వెల్లడిస్తున్న యనమల ఈశ్వర్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : ఇన్‌చార్జి కలెక్టర్

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష

ప్రజాశక్తి - గుంటూరు

హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ అధికారుల్ని ఆదేశించారు. బుధవారం కలక్టరేట్‌లోని సంయుక్త కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ యోగాంధ్ర -2025, హౌసింగ్, రైస్ కార్డులు, ఎన్ ఆర్ ఈ జీయస్, సీసీ ఆర్ సీ కార్డు, అన్నదాత సుఖీభవ, రీ సర్వే పై సబ్ కలెక్టర్, ఆర్టీఓ, యంపీడీఓలు, తహాశీల్దార్లు , మండల అధికారులు , మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ తేజ మాట్లాడుతూ హౌసింగ్ లేఅవుట్లలో ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణాల పురోగతి లేదన్నారు. 3300 ఇళ్ల లక్ష్యానికిగాను 175 ఇల్లు మాత్రమే నిర్మాణం పూర్తి అయ్యాయన్నారు. స్టేజ్ అప్డేషన్‌లో 486 ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయని తెలిపారు. తెనాలి, పొన్నూరు మున్సిపలిటీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు తక్కువగా వున్నాయని , కమిషనర్లు , హౌసింగ్ శాఖ అధికారులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలను ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. అంతర్జాతీయా యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ప్రతి శాఖకు లాగిన్ ఇవ్వడం జరిగిందన్నారు. జూన్ 2వ తేదీ నుండి సచివాలయాల పరిదిలో యోగాంధ్ర -2025 కార్యక్రమంపై పోటీలు నిర్వహించాలన్నారు. సీసీఆర్సీ కార్డులపై మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో రూపొందించిన నియమ నిబంధనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎన్.ఎస్.కే. ఖాజావలి , పీడీ హౌసింగ్ ప్రసాద్ , డ్వామా పీడీ శంకర్ ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏ.డి పవన్ కుమార్, డియం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

రాష్ట్రానికి చంద్రబాబు ఆక్సిజన్ అందించారు

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసీపీ పాలనలో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి చంద్ర బాబు నాయుడు ఆక్సిజన్ అందించారని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కడప మహానాడులో ప్రసంగించిన పెమ్మసాని వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. తరం మారింది.. స్వరం మారింది.. అరాచకానికి కాలం చెల్లిందన్నారు. 2019 తర్వాత చూస్తే 2024 వరకు జరిగిన అరాచకం అన్న రాష్ట్రం అన్ని విధాల నష్టపోయిందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో జగన్మోహన్ రెడ్డికి పూర్తి అధికారం ఉంది. కావాల్సినంత మంది ఎంపీలు ఉన్నారు, కావాల్సినంతటువంటి అవినీతి సొమ్ము ఉంది, ఆయనకు గొప్పో ధైర్యం ఉంది. అయినా కూడా ఏమి చేయలేకపోయారనీ విమర్శించారు. ప్రపంచమంతా మన వైపు చూసేలా అమరావతి నగరం అద్భుతంగా రూపుదిద్దుకోబోతుందన్నారు. రాబోయే అమరావతి మహానగరం చరిత్రలో ఒక మైలురాయిగా మిగిలిపోబోతుందన్నారు. అలాగే ఆగిపోయిన పోలవరాన్ని చంద్రబాబు నాయుడు పూర్తి చేస్తారన్నారు.

మహానాడులో ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడిన ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైఎస్ఆర్ కడప జిల్లాలో టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహానాడు వేడుకల్లో రెండవ రోజు బుధవారం సభా వేదికపై నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుతో మాట్లాడారు. పలు అంశాలపై ఆయనతో చర్చించారు. నరసరావుపేట మండ లం వైస్ ఎంపిపి పదవిని టిడిపి కైవసం చేసుకున్న విషయాన్ని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ వివరిం చగా ముఖ్యమంత్రి అభినందించారు. మహానాడు వేడుకకు నరసరావుపేట నియోజకవర్గం నుంచి వేలాదిమంది టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మొగలి ఆంజనేయులు

అన్ని గిరిజన ప్రాంతాల్లో వైసిపి గెలుపు ఖాయం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని గిరి జన ప్రాంతాలలో వైసిపి విజయ బావుటా ఎగుర వేస్తుం దని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం నరసరావుపేట వైసిపి కార్యాలయంలో ఆ నియోజక వర్గ వైసిపి ఎస్‌టి విభాగం నూతన అధ్యక్షునిగా నియమితులైన మొగిలి ఆంజనేయులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో గిరిజనుల కోసం సంక్షేమ పథకాలు అమ లు, పాడేరులో గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. మాజీ ఎస్‌టి కార్పొ రేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, ఎం.నరసింహారెడ్డి, కరిముల్లా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుబ్బారావు

నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సుబ్బారావు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రహ్మణ సేవా సంఘం రాష్ట్ర చైర్మన్ గా సత్తెనపల్లికి చెందిన పిల్లుట్ల సుబ్బారావును ఎన్ను కున్నారు. ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్య వర్గ సమావేశం విజయవాడ హనుమాన్ పేటలో ధరణికోట లక్ష్మి నారాయణ అధ్యక్షతన బుధవారం జరిగింది.నాయీ బ్రాహ్మణు లు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు. త్వరలో రాష్ట్ర మహసభను నిర్వహించాలని సమావేశం తీర్మానించింది.. అడ్ హక్ కమిటీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర చైర్మన్‌గా పి.సుబ్బారావు కన్వీనర్‌గా కుమారిశివ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యం.కిరణ్ కుమార్, కో కన్వీనర్‌గా వై.రాజారావు, గౌరవ సలహాదారుగా కె.మల్లిఖార్జున, పట్నాల విజయ్, కోమరి శ్రీనివాస్ కోశాధికారిగా గుంటూరు మస్తాన్ నియమితులయ్యారు.

జీవితంలో యోగా భాగం కావాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సూచనలు మేరకు నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధ వారం పల్నాడు జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్ప కొండ వద్ద యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరె, జిల్లా రెవెన్యూ అధికారి మురళి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారు. అందరూ వారి వారి వసతుల ను బట్టి రోజుకు గంట పాటు యోగాభ్యాసం చేయాలి అన్నారు. యోగా వలన కొన్ని శారీరక రుగ్మతలు దూరమవుతాయని వెన్ను పూస, ఇతర శరీర, కండరాల నొప్పి దూరమయ్యే అవకా శం ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని కోటప్పకొండ వద్ద ఏర్పాటు చేసిన పాల్గొన్న అధికారులకు అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

యోగ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆలపాటి వెంకట రమణ, ఎంపీడీవో స్వరూప రాణి, డిప్యూటీ ఎంపీడీవో నిర్మల లక్ష్మీకుమారి, పంచాయతీ కార్యదర్శి మక్కెన సుబ్బారావు, సీసీ సాంబశివరావు, జూనియర్ అసిస్టెంట్ జాన్ కెనడీ, రెండు గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

యోగా చేస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే

మాచర్ల రూరల్

యోగాసనాలు చేయటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని శ్రీ రామకష్ణ సేవాసమితి అధ్యక్షులు, స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మాచర్ల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగాసనాలు శిక్షణ కార్యక్రమాన్ని గోవిందరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మరియు మండల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో యోగా ఇన్చార్జి బెల్లం కొండ తహసిల్దార్ ఆస్పిన్ ఉన్నిసా బేగం బెల్లంకొండ సచివాలయంలో బెల్లంకొండ ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్ నాగిరెడ్డి పాలెం సచివాలయంలో పాల్గొన్నారు. గెస్ట్ స్పీకర్గా డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ఆయుష్ వైద్యాధికారి పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ సీజనల్ పండ్లు చిరుధాన్యనాలు తీసుకోవాలని తెలియపరిచినారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీడీవో శ్రీనివాస్ నాయక్ సీతారాంరెడ్డి యోగా ఆంధ్రా ర్యాలీలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది పోలీస్ శాఖ సిబ్బంది ఏఎన్ఎంలు ఆశాలు ఆయుష్ శాఖ సిబ్బందితో కలిసి యోగ టీచర్లు భూక్య హనుమంతరావు నాయక్ కోటేశ్వరమ్మ వెంకట్‌రెడ్డి యోగ ప్రాక్టీస్ చేయించి నారు సిబ్బంది వెంకటరామయ్య గ్రామస్తులు, పాల్గొన్నారు.

గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తెనాలిలో గంజాయి మత్తులో పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి సంఘటనను దృష్టిలో పెట్టుకొని ఇకనైనా గంజాయి , ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలను తీసుకొని నేరాలు జరగకుండా చూడాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జి క్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భాను ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్నార్టీ సెంటర్లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గంజాయి మత్తులో పోలీస్ కానిస్టేబుల్‌పై రౌడీషీటర్ అనుచరులు చేసిన దాడిని మాత్రమే డిపార్ట్మెంట్ సీరియస్‌గా తీసు కుంటే సరిపోదని, గంజాయి ఇతర మత్తు పదార్థాల వలన నేరాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని అనేక కుటుం బాలు నరకయాతన అనుభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులైన తల్లి దండ్రులను, కట్టుకున్న భార్యని చావబాదుతున్న సంఘటనలు నిత్యం వెలుగులోకి వస్తున్నాయన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు,యువతను సమ న్వయం చేసుకొని వారిద్వారా సమాచారాన్ని సేకరించి మత్తు పదార్థాలను సరఫరా చేసే వారిపై ఉక్కుపాదాన్ని మోపాలని కోరారు. మత్తుపదార్థాల వినియోగంపై నిఘా ఉంచి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ప్లాంటేషన్ మేనేజర్ శిరీష

పండ్ల తోటల పెంపకానికి వంద శాతం సబ్సిడీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

సన్న, చిన్నకారుల రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా 18 రకాల పండ్ల తోట పెంపకాలను 100 శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు పల్నాడు జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శిరీష తెలిపారు. బుధవారం మండల లోని తాళ్లపల్లి , ఏకునంపేట గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ ఆమె మాట్లాడారు. రైతన్నలకు అండగా ఉండేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 100శాతం సబ్సిడీతో పండ్ల తోట పెంపకాలకు ప్రోత్సాహం అందిస్తున్నామనీ, దీనిని ప్రతి రైతు ఉపయోగించుకొని తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని పొందాలని అన్నారు. వాణిజ్య పంటల ద్వారానే రైతులకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ నాగ శ్రీనివాస్, జెఇ గోపి టెక్నికల్ అసిస్టెంట్లు వెంకయ్య, కిషోర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడులో ఎమ్మెల్యే ప్రవీణ్ రూ.43 లక్షల విరాళం

ప్రజాశక్తి - అమరావతి

తెలుగుదేశం పార్టీ స్థాపించి 43 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా సందర్భంగా పార్టీ నిధికి విరాళంగా రూ.43 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అందజేశారు. కడపలో జరుగుతున్న మహానాడు సభా వేదికపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లా డుతూ కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా పని చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనన్నారు. తన రాజకీయ జీవితం మొత్తానికి తెలుగు దేశం పార్టీనే మూలా ధారమని కార్యకర్త స్థాయి నుండి నేడు ఎమ్మెల్యేగా తనను తెలుగుదేశం పార్టీ ప్రజల ముందు నిలబెట్టిం దన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దూరదష్టి, శ్రమ, అభివృద్ధి పట్ల ఉన్న కట్టుబాటే తెలుగుదేశం పార్టీకి అంతట విశ్వసనీయతను తెచ్చి పెట్టిందన్నారు. ఇటువంటి గొప్ప పార్టీకి చెందిన ఒక కార్యకర్తగా, ప్రజాప్రతి నిధిగా మంత్రి లోకేష్ సహకారంతో ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

ముఖ్యమంత్రికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించుకోవ డం వారికి ఇచ్చిన గొప్ప గౌరవం అని పల్నాడు జిల్లా జా యింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలు రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించారు. తొలుత రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జాయింట్ కలెక్టర్ మాట్లాతుతూ మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకుని జీవితంలో పాఠాలుగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎంఐపి అధికారి ఆంజనేయులు, డిప్యూటి కలెక్టర్ కుమార్, ఆర్డీఓ కె.మధులత, అధికారులు పాల్గొన్నారు.

తెలుగువారి ఖ్యాతి ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని ఎస్‌పి కంచి శ్రీనివాస రావు అన్నారు.ఎన్టీఆర్ చిత్ర పటానికి ఎస్‌పి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జెవి సంతోష్, ఏఆర్ వెల్ఫేర్ ఆర్.ఐ ఎల్.గోపి నాథ్, ఎస్.బి సీఐ 2 శరత్ బాబు, సిసి ఆదిశేషు, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణం రఘురామ్‌నగర్ ప్రజావేదిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి యెలినేడ రామస్వామి టిడిపి నాయకులు కంబాల వెంకటేశ్వర రావు, ఆతుకూరి నాగేశ్వరరావు, సయ్యద్‌కరిముల్లా దివ్వెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిరుమామిళ్ల కోటేశ్వర రావు ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ వాసిరెడ్డి హాజరై కాల్వకట్ట వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, 32 వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విజయ పురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆడెపు కోటయ్య, మత్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, జనసేన అధ్య క్షుడు రాహుల్, బొబ్బిలి చంద్రశేఖర్, కట్టారాజు, చరణ్, రాంచంద్, పవన్, ఏసు, రాజారావు,చంటి,యాకోబు, నాగయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతికి ఆయన చిత్రపఠానికి పులమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, డీఈఈ అబ్దుల్ రహీం, ఉద్యోగులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

కోసూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కాంటు కాశయ్య, క్రోసూరు మండల తెలుగుదేశం నాయకుల ఆధ్వర్యంలో తారక రామారావు చిత్ర పటం వద్ద ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంద్రు కాశయ్య, రామారావు, కంచెటి నరసింహారావు బండారు మైసూర్ దుద్దుల యోహాను, హసన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక మెయిన్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి జయంతి వేడుకలు జరిపారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ మాట్లాడుతూ కార్యక్రమంలో నాయకులు యాగంటి మల్లికార్జునరావు, మద్దిగపు చిన వెంకట్రామి రెడ్డి, పోలూరి నరసింహారావు, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, బృంగా రమణ, సంభోజు వేణు పాల్గొన్నారు.

జిజిహెచ్‌కి వీల్ ఛైర్ల బహూకరణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మాజీ మంత్రి నన్నకునే రాజకుమారి నాలుగువీల్ ఛైర్లు బహూకరించారు. ఎన్టీఆర్ జయంతి వేడుక సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి హాజరై ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి 4వీల్ ఛైర్లను ఆమె విరాళంగా అందజేశారు. గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర& మన్నె సుబ్బారావు, సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నూతలపాటి తిరుపతయ్య, ఉపాధ్యక్షులు మదమంచి నాగమల్లేశ్వరావు, కార్యదర్శి కోగంటి బసవ నందికేశ్వరరావు, కోశాధికారి బండ్ల దశరథరామారావు సంయుక్త కార్యదర్శి రావిపాటి శరత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ గోల్డెన్ ఎల్‌టిసి సెంటర్‌గా తుమ్మలపాలెం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గుంటూరు జిల్లా మోడల్ గోల్డెన్ ఎల్‌టిసి సెంటర్‌గా తుమ్మలపాలెం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు డిపిఓ నాగసాయి కుమార్ తెలిపారు. బుధవారం ప్రత్తిపాడు మండల పరిధిలోని తుమ్మల పాలెం గ్రామాన్ని డిపిఓ నాగ సాయికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు గ్రామంలో డోర్ టూ డోర్ తడి, పొడి చెత్త వ్యర్థాల సేకరణ, చెత్త సేకరణకు డస్ట్ బిన్స్‌ను ప్రతి ఇంటికి అందించుట, గ్రామంలోని ప్రజలకు తడి పొడి వ్యర్థాల గురించి పూర్తి స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, తడి చెత్త వ్యర్థాల నుండి వర్మీ తయారు చేయడం, గ్రామంలో ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా రోడ్లు పరిశుభ్రత పాటించుట, గ్రామంలో బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకుండా టం టం, మైకు ద్వారా, డోర్ టూ డోర్ కర్ర పత్రాల పంపిణీ చేస్తామన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలలో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం విధించి, ప్లాస్టిక్ వాడకం వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రజలకు తెలిపారు. ఐటీసీ, ఫినిష్ సొసైటీ వారు బహూకరించిన గుడ్డ సంచులను డోర్ టూ డోర్ జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డివిజనల్ పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరావు, డిపిఆర్‌సి రిసోర్స్ పర్సన్స్ నిరంజన్ కుమార్, కరీముద్దీన్, ప్రత్తిపాడు ఇంచార్జి డిప్యూటీ ఎంపిడిఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, ఐటీసీ, ఫినిష్ సొసైటీ కో ఆర్డినేటర్ ఉమా మహేశ్వరి, క్లాప్ మిత్రా మరియు షెడ్ మిత్రా సిబ్బంది పాల్గొన్నారు.

నడప్‌లను పరిశీలిస్తున్న డిపిఓ నాగ సాయి కుమార్

డిపో దగ్గరే రేషన్ - స్వాగతించిన డీలర్లు

ప్రజాశక్తి- తాడేపల్లి

నెలలో ఎప్పుడైనా రేషన్ డిపో దగ్గర తెల్ల కార్డు ఉన్న పేదలు రేషన్ పొందవచ్చు అని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల తాడేపల్లి మండల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పెనుమకలో చంద్రబాబు పాలాభిషేకం నిర్వహించారు. డీలర్ల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ డి బ్రహ్మానందరావు, పెనుమత్స డూండీతో పాటు పలువురు డీలర్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

176వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 176వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కె.అగ్గయ్య, శారద, డి.రమణమ్మ, సువర్ణ కుమారి, ఉప్పు కాశమ్మ కూర్చున్నారు. దీక్షలను వైయస్సార్ టియు నాయకులు మండ్రు మనోహర్, సిఐటియు నాయకులు ఎమ్మెల నరసింహారావు (విశాలాంధ్ర) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్మికుల నాయకుడు కె.స్టీవెన్, వేముల దుర్గారావు, ఆశీర్వాదం, వై.సాంబశివరావు, గురవయ్య, సుభాని, టి.నాగేశ్వరావు, రహమతుల్లా, మహిళలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

31వ రోజు గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - పెదకాకాని

విద్యార్థుల మనోవికాసం కోసం పెదకాకాని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు బుధవారానికి 31వ రోజు చేరుకున్నాయని గ్రంథాలయ అధికారి విజయ్ కుమార్ తెలియజేశారు. విద్యార్థిని విద్యార్థులకు స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, యోగా, పుస్తక ప్రదర్శన,డాన్స్,ఇన్ డోర్ గేమ్స్ ఆడించడం జరిగిందని, ఈ రోజు వేసవి విజ్ఞాన తరగతులలో విద్యార్థులకు స్వర్ణాంధ్ర 2047 అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించమన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నాగేశ్వరరావు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళగిరి, తాడేపల్లి, కుంచనపల్లిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, తెనాలి మున్సిపాల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్పర్సన్, సిబ్బంది

వాడవాడలా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి విలేకరులు

మంగళగిరి : పట్టణంలోని 14వ వార్డులోటిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.టి.రామారావు జయంతి వేడుకలు బుధవారం గుంటూరు పార్లమెంటరీ పద్మశాలి సాధికారిక సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు గౌడ్, మాజీ కౌన్సిలర్ శ్రీమతి వింజమూరు ఆశాబాల తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

పూల మార్కెట్ సెంటర్లో అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి ఘనంగా జరిింది. అసోసియేషన్ అధ్యక్షుడు షేక్, పోతినేని శ్రీనివాసరావు, ఆషాబాల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు జంజనం వెంకట సుబ్బారావు, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు తిరువీధుల భావనారాయణ, బత్తూరు రాజ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు, ఉపాధ్యక్షులు నల్లమోలు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో

నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు, తదితరులు పాల్గన్నారు.

తాడేపల్లి : మాజీ సీఎం ఎన్.టి.రామారావు జయంతి వేడుకలు బుధవారం పెనుమాక, తాడేపల్లి, బ్రహ్మానందపురంలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు పాలెపు వీరేంద్రనాథ్, మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, కె.స్వర్ణలత, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్ : కుంచనపల్లి టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి బిరుదుగడ్డ రమేష్, కోలంటి మహేష్, ఎస్. శ్రీనివాసరావు, దాశెట్టి అరుణ,గుంటుపల్లి లక్ష్మి, కొలంటి మాణిక్యరావు, కొమ్మోజి కృష్ణ బాబు, మారుమాక రాజేష్, , దాశెట్టి శివయ్య, తప్పట్ల రాజు, బుల్ల అబ్రహం, తిరుమలశెట్టి శేషయ్య, కుంచనపల్లి గ్రామ టిడిపి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రాతూరులో

టిడిపి గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రాతూరులో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాటిబండ్ల నరసింహా రావు, పాటిబండ్ల వెంకటేశ్వరరావు, ఆలపాటి సాంబశివ రావు, గుర్రపు పెదరత్తయ్య, పాతూరు బాబురావు, చొక్కా మధు, సంకురు బ్రిడ్జిరాజ్, చొక్కా మోహన్ రావు, గుంటుపల్లి లక్ష్మి, దావులూరు అనిల్, పాతూరు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని : స్థానిక టీడీపీ ఎన్టీఆర్ జయంతి వేకలు ఘనంగా జరిగాయి. కాకాని సెంటర్లో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కేక్ కటింగ్ చేసి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

గుంటూరులో ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ ఉద్యోగులు

గుంటూరు : స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ అకౌంట్ ఆఫీసర్ పుల్లగూర శామ్యూల్‌పాల్, ఉద్యోగులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జెడ్పీ చైర్మన్ ఓఎస్‌డి శివన్నారాయణ, ఏవో రాజారత్నబాబు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘాల రాష్ట్ర నాయకులు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, టి.శ్రీనివాసరావు, జెడ్పీ ఉద్యోగి ఉషాదేవి, పాల్గొన్నారు.

చేబ్రోలు : ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. చేబ్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎ.ఉమాదేవి అధ్యక్షతన ఈ ఓ పిఆర్ అండ్‌ఆర్‌డి టి.ఉషారాణి, కార్యాలయ సిబ్బంది అలాగ చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి శ్రీదేవి అధ్యక్షతన డాక్టర్ పత్తూరి శ్రీనివాసులు , తెలుగు అధ్యాపకులు ఇతర కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పచ్చిగండ్ల వినితారాణి అధ్యక్షతన కార్యదర్శి కె.శ్రీనివాసంావు, సిబ్బంది ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. నారాకోడూరు మెయిన్ సెంటర్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు మహిళా వెంకటరామ రాజు, మండల గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.

తెనాలి : ఎన్టీఆర్ జయంతి వేడుకలు గురువారం ప్రభుత్వ కార్యాలయాలలో నిర్వహించారు. సబ్ కలెక్టర్ సంజన సింహ తన కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి మునిసిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ బి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వి లక్ష్మీపతి, కౌన్సిలర్లు పసుపులేటి.త్రిమూర్తి, దేసు.యుగంధర్, అన్నం. పిన్నారావు, బోయపాటి అరుణ,దివి అనిత, కొర్రపాటి లక్ష్మి, జి. మానస రెడ్డి, టి.బ్రహ్మేశ్వర రావు, వివిధ విభాగాల అధికారులు, అవుట్ డోర్, ఇండోర్ సిబ్బంది పాల్గొన్నారు.

తుళ్లూరులో అన్నదానం

తుళ్లూరు : ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తుళ్లూరులో అన్నదానం నిర్వహించారు. తొలుత టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షులు మూల్పూరి నరేష్ చౌదరి, మాజీ జెడ్పిటిసి దామినేని శ్రీనివాసరావు తదితరులు స్థానిక గీతా మందిరం సెంటర్‌లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్కాపురం, రాయపూడి తదితర గ్రామాల్లో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు జరిగాయి.

మేడికొండూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి ఘనంగా జరిగింది. ఎంపీడీఓ తోట చందన, ఏఓ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ పూర్ణ శంకరరావు, ఏపీఓ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర : మండలంలోని పలు గ్రామంలో ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. కొల్లిపర శివారు గుదిబండి వారి పాలెం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి బి.సుబ్బారావు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ భీమవరం పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి కార్యాలయ సిబ్బంది నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అన్నదానం చేస్తున్న బ్లడ్ వెల్ఫేర్ సభ్యులు

బ్లడ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - చేబ్రోలు

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పత్తెళ్ల శేషగిరిరావు జ్ఞాపకార్థం నిరాశ్రయులైన పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు సంస్థ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ బుధవారం తెలిపారు. నిడుబ్రోలు రైల్వే స్టేషన్ దగ్గర మరియు ఓవర్ బ్రిడ్జి కింద ఉంటున్న పేదవారికి, పొన్నూరు లోని పలు ప్రదేశాలలో అన్నందానం చేశారు. అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన మనవళ్లు తన్నీరు రవీంద్రబాబు కోటేశ్వరరావుకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చిల్లా అనిల్ నాయుడు, పొన్నగంటి గోపి వేంపాటి అఖిల్ సాయి తొట్టెంపూడి శశాంక్ పసుపులేటి మణి వర్మ తిరుమల శెట్టి జాహ్నవి, మేఘనాథ్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్ని 2న ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

జూన్ రెండవ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలలో రెండు సెంట్లు గ్రామాలలో మూడు గంటలు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

అక్షితకు నాట్య మయూరి అవార్డు

ప్రజాశక్తి మంగళగిరి

కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రదర్శన ఇచ్చిన మంగళ గిరికి చెందిన మునగాల గేయ అక్షితకు నాట్య మయూరి అవార్డు లభించింది. పాత మంగ ళగిరికి చెందిన మునగాల మురళీకృష్ణ, మౌనిక దంపతుల కుమార్తె అక్షిత స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. ఈ మేరకు బుధవారం అక్షిత తండ్రి మురళీ కృష్ణ తెలిపారు. విజయవాడలో శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయంలో సప్పా శివకుమార్ వద్ద అక్షిత శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందుతుంది. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో కళానిలయం ఆధ్వర్యాన ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి 40వ శాస్త్రీయ, పాశ్చాత్య సంగీత, నత్య పోటీల్లో పాల్గొన్న అక్షిత కూచిపూడి-ఏ గ్రూపులో భామా కలాపం నృత్య ప్రదర్శనకు గాను ప్రథమ బహుమతిని సాధించింది. కళా నిలయం ఆధ్వర్యంలో అక్షితకు మంగళవారం నాట్య మయూరి అవార్డును ప్రదానం చేశారు. కూచిపూడి నాట్యంలో అద్భుత ప్రతిభ కనబర్చిన అక్షితను పలువురు ప్రముఖులు అభినందించారు.

నాట్య మయూరి అవార్డును అందుకుంటున్న గేయ అక్షిత

ఒలింపియాడ్ అవార్డుల్లో గుంటూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎస్‌ఓఎఫ్ ఒలింపియాడ్ 2024-25 పరీక్షల్లో నగరానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అలెన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆరో గ్రేడ్ విద్యార్థి గొంతు శివ జగదీశ్వర్ రెడ్డి ఇంటర్నేషనల్ మేథమెటిక్స్ ఒలింపియాడ్‌లో నాల్గవ ర్యాంక్ సాధించి, మెరిట్ సర్టిఫికెట్ పొందారు. అదే స్కూలుకు చెందిన 8వ గ్రేడ్ విద్యార్థి భోగిరెడ్డి శశికిరణ్ సైతం మేథమెటిక్స్ ఒలింపియాడ్‌లో నాల్గవ ర్యాంక్‌ను సాధించి మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నాడు. విట్ ఒలింపియాడ్ స్కూల్ సెకండ్ గ్రేడ్ విద్యార్థి గొల్లపూడి రోషన్ సాయి శర్మ, అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో ఐదో ర్యాంక్‌ను సాధించి, మెరిట్ సర్టిఫికెట్ పొందాడు. 2024-25 విద్యా సంవత్సరంలో అంతర్జాతీయ ఒలింపియాడ్ విజేతలు, ఉపాధ్యాయులను గుర్తించడానికి ఎస్‌ఓఎఫ్, ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో బుధవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె. మహేశ్వరి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

థియేటర్లలో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పశ్చిమ మండల పరిధిలోని సినిమా థియేటర్లలో బుధవారం రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీలు నిర్వహిం చారు. సినిమా హాల్స్‌లో ప్రేక్షకు లకు కల్పించాల్సిన వసతుల గురించి ఆరా తీశారు. సిని మాలకు సంబంధించిన అనుమ తులు ఫైర్‌సేఫ్టీ పద్దతు లు, తదితర విషయాలను పరిశీలిం చారు. వినోదం కోసం సినిమా హాళ్ళకు తరలివచ్చే ప్రేక్షకులకు కల్పించాల్సిన అన్ని సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాల్సిందేనన్నారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సినిమా హాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే హాళ్లను సీజ్ చేస్తామన్నారు. సినిమా హాల్ యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనన్నారు. తినుబండారాలు ఆహార పానీయాలు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో ఆర్.ఐ.మాణిక్యరావు, డిప్యూటీ తహశీల్దార్ బేగ తనిఖీలలో పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న అధికారులు

సేవా రంగంలో మలబార్ గోల్డ్ విశేష కృషి : సిఐ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ లక్ష్మీపురం షోరూంలో హంగర్ ఫ్రీ వరల్డ్ అనౌన్స్ ఈవెంట్‌ను బుధవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి స్థానికఅరండల్ పేట సి.ఐ అరోగ్యరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐ అరోగ్యరాజు మీడియాతో మాట్లాడుతూ సేవారంగంలో మలబార్ చేస్తున్న విశేష కార్యక్రమాలను అభినందించారు. పేద ప్రజలకు ఆకలిని తీరుస్తూ విలువైన విద్యను అందించే విధంగా మలబార్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని అన్నారు. స్టోర్ మార్కెటింగ్ మేనేజర్ గోపీ కిరణ్ మాట్లాడుతూ తమ సంస్థ పేదల కోసం రూ.310 కోట్లు ఖర్చు పెట్టి పేదలను ఆదుకున్నట్టు తెలిపారు. స్టోర్ హెడ్ నదీర్., పెద్ది రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. ముఖ్యంగా ప్రీ మాన్సూన్ డ్రై సోవింగ్ (పిఎండిఎస్) విధానం ద్వారా రైతులు అధిక పంట దిగుబడిని పొందవచ్చని అన్నారు. తెనాలి మండల పరిధి ఎరుకలపూడి గ్రామంలో రైతులు రంగయ్య, విజయలక్ష్మిలు పీఎండిఎస్ విధానంలో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్ విధానాన్ని పాటించినట్లయితే భూమిలో సారం పెరగడమే కాకుండా ఆయా పంటల నుండి కొంత మేర అధిక దిగుబడులను పొందవచ్చన్నారు. నేల నీటి ఎద్దడిని తట్టుకొని ప్రధాన పంటల్లో అధిక దిగుబడిని ఇచ్చేందుకు పిఎండిఎస్ విధానం రైతులకు ఉపయోగకరంగా మారుతుందన్నారు. పలు ప్రాంతాల్లో రైతులు రెండు వానాకాలం పంటలకు ముందు ఈ విధానం పాటిస్తూ మంచి ఫలితాలను పొందతున్నారన్నారు. పిఎండిఎస్ విధానంలో 32 రకాల పంటలను సాగు చేయవచ్చన్నారు. పిఎండిఎస్ విధానాన్ని అనుసరిస్తున్న రైతులు తమ యొక్క అనుభవాలను సదస్సులు రూపంలో వెల్లడించాలని సూచించారు. విషతుల్య మవుతున్న ఆహారం, మరోవైపు దెబ్బ తింటున్న భూసారం వీటన్నింటికీ ఏకైక పరిష్కారం ప్రకృతి వ్యవసాయమేనని అన్నారు. పిఎండిఎస్ పద్ధతిలో సాగు చేయడం భూమిలో సేంద్రీయ ఖర్బణం, సూక్ష్మ ధాతువుల లభ్యత గణనీయంగా పెరిగి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సుస్థిర వ్యవసాయాన్ని సాధించవచ్చని తెలిపారు. వాటికి బదులు నవధాన్యాల సాగుతో సహజసిద్ధ ఎరువులు తయారు చేయడం ప్రతి రైతుకూ వరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో జనుము, జీలుగ, పిల్లిపెసర, పచ్చిరొట్టతో పాటు పెసలు, ఉలవలు, మినుములు, పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, ఆకుకూరలు, సుంగంధ ద్రవ్యాలు, దుంపజాతి విత్తనాలను కలిపిన నవధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె రాజకుమారి తెనాలి ఎడిఎ ఎన్ ఉషారాణి, ఎఒ జి ప్రేమ సాగర్, ఎంఇఒ, విఎఎ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకలపూడి గ్రామంలో పిఎండిఎస్ సాగును పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ డైరెక్టర్ ఢిల్లీ రావు

గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

తాడేపల్లి మండల పరిధిలోని గ్రామాలలో స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు సిపిఎం కార్యాలయంలో బుధవారం రాత్రి విస్తృత సమావేశం సిపిఎం నాయకులు డోకిపర్తి రాజేంద్ర బాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం గడుస్తున్న స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో మురుగు సమస్య తీవ్రంగా ఉందని, వర్షాలు అధికంగా కురిసినప్పుడు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోతుందని విమర్శించారు. అన్ని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, మురుగునీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, రుణాలు మంజూరు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులతో పాటు కౌలు రైతులకు రూ.20 వేలను ప్రభుత్వం అందజేయాలన్నారు. మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, గృహ నిర్మాణ పథకం ద్వారా ఇళ్లను నిర్మించాలన్నారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కుంచనపల్లి నుండి రేవేంద్రపాడు వరకు ఉన్న పీడబ్ల్యుడి కట్ట వెంబడి నివసిస్తున్న నివాస ప్రాంతాల వారికి ఇబ్బందులు కలగకుండా రోడ్డు నిర్మాణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం పంట కాలువలో మురుగునీరు కలవకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి కాలువను పరిరక్షించాలన్నారు. అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు. చిర్రావూరిలో పశు వైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్ని నియమించి, గ్రామంలో మురుగునీరు నిల్వ కాకుండా కృష్ణానది పరివాహక ప్రాంతం కరకట్ట వెంబడి డ్రైన్స్ నిర్మాణం చేపటా ్టలన్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమిశెట్టి రంగారావు, వడ్డేశ్వరం సిపిఎం సీనియర్ నాయకులు ఎస్ కే పాపా సాహెబ్, కంచర్ల జేమ్స్, బత్తుల సంసోను, పుల్లగూర సుబ్బారావు, కొండపల్లి యశోద, ఎస్.కె గన్ మరియా బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వై.నేతాజీ

వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్‌ను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఆర్టీసి కాలనీ పార్క్, కాకాణి రోడ్, సీతానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పార్కుల్లో నూతనంగా చేట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసి కాలనీ పార్కులో వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్ ఎక్విప్‌మెంట్ మరమ్మతు పనులు చేపట్టాలని ఏఈని ఆదేశించారు. పార్కుల్లో పచ్చదనం పెంపునకు ఉద్యానవన విభాగ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, వర్షాలకు వాకింగ్ ట్రాక్‌లలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా చేయవచ్చని, అందుకు పిన్ పాయింట్‌గా పారిశుధ్య పనులు చేసేందుకు సచివాలయం పరిధిలో కార్మికుల హాజరు, పనితీరు, పారిశుధ్యం పూర్తిగా శానిటేషన్ కార్యదర్శే భాధ్యత వహించాలన్నారు. డ్రైన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, ఇన్స్పెక్టర్లు, ఎస్ఎస్ లు మధ్యాహ్నం సమయంలో కార్మికులు డ్రైన్లు శుభ్రం చేసేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నోడల్ అధికారులు కూడా ప్రతిరోజు పారిశుధ్య పనులను పర్యవేక్షణచేసి, లోపాలు ఉన్న ప్రాంతాల్లో నివేదిక ఇవ్వాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ కె.రంగారెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ఆర్ఓ సాదిక్ బాష, టిపిఎస్ లు, ఆర్ఐలు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసి కాలనీ వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న నగర కమిషనర్